క్లుప్తంగా

ఆదిశిలా క్షేత్రంలో భక్తుల సందడి



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి వచ్చిన భక్తులతో ఆవరణం పోటెత్తింది. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిశిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాలలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కోదండాపురం ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం వికాస్ తరంగిని ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. కార్యక్రమానికి వీహెచ్‌పీ ధర్మ ప్రచారక్ నర్సింహస్వామి ఆలయంలో ఐదు సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ సభ్యులు సత్యం, కేకే రెడ్డి, లక్ష్మీనారాయణ, లక్ష్మన్న, ప్రజలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ధరూరు: మండలంలోని నీలహళ్లి గ్రామంలో బీఆర్‌ఎస్ సీనియర్ కార్యకర్త బోయ చిన్న హన్మంతు తండ్రి ఎర్ర నర్సప్ప(50) మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పరామర్శించారు.

టపాసులు కాల్చి సంబరాలు



కేటీదొడ్డి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో కార్యకర్తలు టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఇనాం భూమిని పరిశీలించిన ఆర్డీఓ



ఉండవెల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ రామచందర్ పలు రికార్డులను పరిశీలించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఇనాం భూమి రికార్డులు, నాలా కనెక్షన్ రికార్డులను పరిశీలించారు. మారమునగాల శివారులోని 188 సర్వే నెంబర్‌లో 7 ఎకరాల భూమి ఇనాంగా పడడంతో సమస్య ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లింది. ధరణిలో ఇనాం పొలం పడడంతో, ఓఆర్‌సీ తీసుకొచ్చి తెలపడంతో ఆ భూమిని నేరుగా ఆర్డీఓ పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ రమణ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

మట్టిఎద్దుల ఊరేగింపు



కేటీదొడ్డి: మండలంలోని కుచినెర్లలో మట్టి ఎద్దుల అమావాస్య సందర్భంగా శనివారం శంబులింగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మట్టి ఎద్దులను తయారీ చేసి వాటిని పూజించి గ్రామంలోని ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పండుగ వాతావరణం తలపించింది. ఎద్దుల ఊరేగింపు తిలకించడానికి వివిధ గ్రామాల ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మానవపాడు: మండలంలోని జల్లాపురంలో పాఠశాల సమస్యలు, విద్య, వైద్యం, వ్యవసాయ సమస్యలు, విద్య అర్హతతో కూడిన డీలర్ నియామకం చేపట్టాలని శనివారం సామాజిక, ఆర్‌టీఐ కార్యకర్త శాతకుమార్ కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం సమర్పించారు. జల్లాపురం గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలో చాలా సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు.

మృతదేహం లభ్యం

కేటీదొడ్డి: కుచినెర్ల గ్రామ శివారులోని గల భారత్‌మాల బ్రిడ్జి వద్ద మృతదేహం గుర్తించినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఎర్సందొడ్డి గ్రామానికి చెందిన మతిస్థిమితంలేని ముష్టి పెద్ద తిమ్మప్ప(56) మృతదేహం కుచినెర్ల శివారులోని భారత్‌మాల బ్రిడ్జి వద్ద గుర్తించారు. మతిస్థిమితం లేకపోవడంతో వల్లనే అతను మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. తిమ్మప్పకు భార్య, కుమారులు ఉన్నారు.

సమస్యల్లో సంక్షేమ హాస్టళ్లు

- ఇరుకు గదుల్లో విద్యార్థుల తిప్పలు
- శిథిలావస్థలో వసతిగృహ భవనాలు
- అరకొర బాత్‌రూంలు
- ప్రహరీలు లేక పాములు, తేళ్ల భయం..

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గదుల కొరత వల్ల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సరిపడినన్ని బాత్‌రూంలు లేవు, నీటి సౌకర్యం, ప్రహరీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షానికి హాస్టళ్ల గదులు ఒరుస్తున్నాయి. ఉండవెల్లి వసతి గృహం పదేళ్లుగా శిథిలావస్థలో ఉంది. రామాపురం హాస్టల్లో బాత్‌రూంల కొరత తీవ్రంగా ఉంది. 30 ఏళ్ల క్రితం నిర్మించిన అయిజ వసతి గృహం పైకప్పు పెచ్చులూడుతున్నాయి. భయంతో విద్యార్థులు గడుపుతున్నారు. రాజోళిలో 40 మంది విద్యార్థులు ఒకే హాల్లో ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల పర్యావేక్షణ లేకపోవడంతో సరైన వసతులు కల్పించడం లేదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- 'సాక్షి' నెట్‌వర్క్



ఉండవెల్లిలో ఒకే గదిలో విద్యార్థుల దుస్తులు, పరుపులు, పెట్టెలు

సాక్షి విజిట్

అద్దె భవనంలో బాలుర వసతి గృహం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని హరిజన వసతి గృహంలో 120 మంది విద్యార్థులు ఉన్నారు. పదేళ్లగా శిథిలావస్థకు చేరిన వసతి గృహాన్ని పట్టించుకునే నాయకులు, అధికారులు కరువయ్యారు. వసతి గృహంలో మరుగుదొడ్ల సమస్య, రాత్రి సమయంలో పాములు, తేళ్లు అధికంగా వస్తున్నాయి. వసతి గృహం చుట్టూ కంపచెట్లు ఉండడంతో దోమలు వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సమస్య పట్టించుకోవాలని కోరుతున్నారు.

బీసీ హాస్టల్ భవనం శిథిలం



అయిజలో పెచ్చులూడిపడిన బీసీ హాస్టల్ గది

అయిజ: మండల కేంద్రంలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన బీసీ హాస్ట భవనం శిథిలమైంది. విద్యార్థులు బస చేసేందుకు మొత్తం 6 గదులు నిర్మించారు. వాటిలో 3 గదులు పూర్తిగా శిథిలమయ్యాయి. పెచ్చులూడి పడుతుండడంతో ఆ మూడు గదులకు తాళం వేశారు. మిగిలిన మూడు గదులను, రెండు హాళ్లను ఉపయోగించుకుంటున్నారు. వర్షం పడిన ప్రతిసారి బీసీ హాస్టల ఆఫీస్ రూం ఒరుస్తుంది. దీంతో ఆఫీస్ రూం తడిగా మారుతుంది. విధులు నిర్వహించేందుకు అధికారులకు ప్రతి కూలంగా మారింది. హాస్టల్‌కు నిర్మించిన స్నానపు గదులు శిథిలమయ్యాయి. వాటికి సంబంధించిన డోర్లు కొన్ని విరిగిపోయాయి. నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లకు పైప్‌లైన్ ఏర్పాటు చేయకపోవడంతో నీటి వసతి లేక అవి నిరుపయోగంగా ఉన్నాయి.

ప్రహరీ లేని ఎస్సీ హాస్టల్



మల్దకల్ ఎస్సీ హాస్టల్‌లో కూలిన ప్రహరీ

మల్దకల్: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు సగం ప్రహరీ కూలిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయిజ–గద్వాల ప్రధాన రహదారిలో ఈ ఎస్సీ హాస్టల్ ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. హాస్టల్‌లో ఉన్న చిన్న చిన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని కోరుతున్నారు.

మరమ్మతుకు నోచుకోని గదులు



విద్యార్థులు నిద్రించే గదిలో ఊడుతున్న పై కప్పు పెచ్చులు

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్లో గదులు మరమ్మతులు నోచుకోక పైకప్పు పెచ్చులూడుతున్నాయి. విద్యార్థులు భయం భయంతో గడుపుతున్నారు. చిన్న పాటి వర్షం కురిసినా గదులన్నీ ఒరుస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వంట గది పూర్తిగా కారుతోంది. హాస్టల్లో 98 మంది విద్యార్థులుండగా, బాత్‌రూం గదులు మరుగున పడడంతో బహిర్భూమికి బయటికి వెళ్లాల్సి వస్తోంది. బీసీ హాస్టల్లో 100 మంది విద్యార్థులకు మరుగుదొడ్లు లేక బయటికి వెళ్తున్నారు. ఈ హాస్టళ్లలో మరుగుదొడ్ల సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

అదనంగా మరుగుదొడ్లు లేక అవస్థలు

శాంతినగర్: ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్‌లో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉంది. వడ్డేపల్లి మండలంలోని రామాపురం ఎస్సీ సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో 63 మంది విద్యార్థులున్నారు. అందరికి సంబంధించి నాలుగు మరుగుదొడ్లు ఉండడంతో ఉదయం వేళలో కాల కృత్యాలు తీర్చుకోవడానికి ఇబ్బంది ఏర్పడుతోంది. అదనంగా మరో నాలుగు టాయిలెట్లు నిర్మించి సమస్య పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.



రామాపురం ప్రభుత్వ ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతి గృహం



విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉన్న మరుగుదొడ్లు

కాలకృత్యాలకు ఇబ్బందిగా ఉంది



పాఠశాలకు అందరం ఒకే సమయంలో వెళ్లాల్సి ఉంటుంది. హాస్టల్‌లో 63 మందిమి ఉన్నాం. ఉదయం వేళలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి అందరం వెళ్లాల్సి ఉంటుంది. కేవలం నాలుగు బాత్‌రూంలే ఉన్నాయి. దీంతో ఇబ్బందిగా ఉంటోంది. అదనంగా కొన్ని మరుగుదొడ్లు నిర్మించి సమస్య పరిష్కరించాలి.

– బి.బాలు, 8వ తరగతి విద్యార్థి, రామాపురం ఎస్సీ హాస్టల్, వడ్డేపల్లి మండలం

ఇరుకు గదిలో ఇబ్బందులు



రాజోళిలో 40 మంది విద్యార్థులు ఉంటున్న హాల్

రాజోళి: మండల కేంద్రంలోని బాలుర వసతి గృహంలో విద్యార్థులకు సరిపడా భవనం లేక ఇబ్బందులు పడుతున్నారు. 40 మంది విద్యార్థులకు ఒకే హాల్ నిర్మించారు. అందులోనే వంట గదిని ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు ఇరుకు గదిలో ఇబ్బందిగా మారింది. భవనం చిన్నగా ఉన్న కారణంగా అడ్మిషన్లు కూడా ఎక్కువగా తీసుకోవడం లేదు. గతంలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరగా. దాని పక్కనే నూతనంగా నిర్మించిన హాల్లో ప్రస్తుతం విద్యార్థులు ఉంటున్నారు. రాత్రి పడుకునే సమయంలో, భోజనాల సమయంలో చాలా ఇబ్బంది పడుతున్నారు. పాత భవనాన్ని కూల్చేయాలని గతంలో కలెక్టర్ ఆదేశించినప్పటికీ ఇంతవరకు అది కూల్చకపోవడంతో అది ఎప్పుడు కూలుతుందోనన్న ఆందోళన విద్యార్థుల్లో నెలకొంది.



శిథిలావస్థకు చేరిన పాత హాస్టల్ భవనం

వర్గీకరణలో ఎమ్మార్పీఎస్‌ది కీలక పాత్ర

- ఎమ్మెల్యే విజయుడు



టీఎస్ ఎమ్మార్పీఎస్ దీక్ష కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: ఎస్సీ వర్గీకరణ సాధనలో ఎమ్మార్పీఎస్‌ది కీలక పాత్ర అని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మార్పీఎస్ దీక్ష కరపత్రాలను శనివారం ఎమ్మెల్యే విడదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంతో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ సారైన ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. వర్గీకరణ సాధనలో ఎమ్మార్పీఎస్ 30 ఏళ్లుగా ఉద్యమిస్తోందన్నారు. ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేశారన్నారు. ఉద్యమంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొందన్నారు. టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 ఏళ్లు కావస్తున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెవడానికి ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. చిరకాల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ అంశం చివరి దశకు చేరిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లెపోగు లక్ష్మణ్ మాదిగ, నాయకులు జయన్న, వెంకటేష్ ఉన్నారు.

చెట్లు తొలగించినా.. పట్టించుకోని అధికారులు



గోకులపాడు రోడ్డు వెంట చెట్లను నరికేసిన దుండగులు

మానవపాడు: గత తెలంగాణ ప్రభుత్వ హయాంలో హరితహారంలో భాగంగా మొక్కల పెంపకం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలలో మొక్కలు నాటించారు. మండలంలోని గోకులపాడు శివారు ప్రాంతంలో రోడ్ల వెంబడి నాటిన మొక్కలను తొలగించారు. రోడ్ల వెంట చెట్లను నరుకుతున్నా పట్టించుకునే వారు కరువైయ్యారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హరితహారంలో భాగంగా వేలకు వేలు ఖర్చు చేసి నాటిన మొక్కలను నాటితే వాటిని నరికి ప్రజాధనం వృథా చేస్తున్నా, పట్టించుకునే నాథుడు కరువయ్యారు. హరితహారంలో భాగంగా మొక్కలను పెంచుతున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం, కాలుష్యం చెడిపోకుండా మొక్కల పెంపకం చేపడుతున్నారు. ఇప్పటికైనా మొక్కల పెంపకంలో అధికారులు నిర్లక్ష్యం వీడి చెట్లను నరికివేతను అరికట్టాలని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బీజేపీ విధానాలతో కార్మికులకు ఇబ్బంది

అయిజ: కార్మిక సంఘం పిలుపులో భాగంగా ఈనెల 10 తేదీన దేశవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ముందు నిర్వహించే కోరికల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నరసింహ అన్నారు. శనివారం హమాలీ సంఘం కార్యాలయంలో సీఐటీయూ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. కార్మికులు కలిసి కట్టుగా పోరాడి హక్కులను సాధించుకోవాలని కోరారు.

సహకార సంఘాల ద్వారానే పురోభివృద్ధి



జెండాను ఆవిష్కరిస్తున్న పీఏసీఎస్ ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి

అయిజ: వ్యవసాయ సహకార సంఘాల ద్వారానే రైతుల పురోభివృద్ధి సాధ్యమని పీఏసీఎస్ ప్రెసిడెంట్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం పురష్కరించుకొని మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో పీఏసీఎస్ ప్రసిడెంట్ సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 1992 డిశంబర్ 16న చేసిన తీర్మానం ద్వారా ప్రతి యేటా జూలై నెలలో మెదటి శనివారాన్ని అంతర్జాతీయ సహకార దినంగా నిర్వహించాలని ప్రకటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో కార్యదర్శి మల్లేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కేంద్రంలోని కార్యదర్శి ప్రభాకర్ నాయుడు ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ, మండల స్థాయిలో సంఘాల ఏర్పాటుతో వాటి పరిధిలోని బ్యాంకుల ద్వారా రుణాలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అయ్యన్న, మాజీ కార్యదర్శి మద్దిలేటి, రైతులు బ్రహ్మేశ్వర్, రమేష్‌నాయుడు, సాయికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి



అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో శనివారం బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని వివిధ సంఘాలు, పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలను సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నదేవన్న, కౌన్సిలర్లు, ఎమ్మార్పీఎస్ ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకుడు మద్దిలేటి, బీజేపీ నాయకులు మాదన్న ఉన్నారు.

శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి



అయిజ: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరసింహయ్య శెట్టి, ప్రధాన కార్యదర్శులు ప్రదీప్ కుమార్, భగత్ రెడ్డి, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గట్టు: శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతిని బీజేపీ నాయకులు శివారెడ్డి ఆధ్వర్యంలోని మండల కేంద్రంలోని నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం బల్గెర గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలోని మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగరాజు, సురేష్, సంజీవనాయుడు, మక్కెరన్న, పటేల్, భీమన్న, దానియేలు ఉన్నారు.

శాంతినగర్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని వడ్డేపల్లి బీజేపీ అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. వడ్డేపల్లి పట్టణంలోని రామచంద్రానగర్‌లో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయన మొక్క నాటారు. కనీసం ఏడాదికి ఒక మొక్క నాటాలని కోరారు. గతంలో దేశ రాజధాని ఢిల్లీలో ఆక్సిజన్ బాటిళ్లు పెట్టుకుని పాఠశాలలకు, ఆఫీసులకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, అలాంటి పరిస్థితులు రాకుండా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు



మహిళకు ప్రథమ చికిత్స చేయిస్తున్న పోలీసులు

శాంతినగర్: మతిస్థిమితం లేని మహిళకు సపర్యాలు చేయించి వారి కుటుంబసభ్యులకు అప్పగించి శాంతినగర్ పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లోని మీసేవ కేంద్రం సమీపంలో 50 ఏళ్ల మహిళ ఆకలితో స్పృహతప్పి పడిపోయింది. గమనించిన పోలీస్ కానిస్టేబుళ్లు విషయాన్ని ఎస్‌ఐ సంతోష్‌కు తెలిపారు. వెంటనే ఆమెకు చికిత్స చేయించి ఆహారం అందించాలని సిబ్బందికి ఎస్‌ఐ సూచించారు. స్థానిక వైద్యులను పిలిపించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం ఆహారం పెట్టి కోలుకునేలా చేశారు. మహిళ వివరాలు తెలుసుకున్నారు. మానవపాడు మండలం కలుకుంట్ల గ్రామానికి చెందిన సవారి భార్య అంజనమ్మగా గుర్తించారు. వెంటనే వారి కుటుంబసభ్యులను శాంతినగర్‌కు రప్పించి కౌన్సిలింగ్ ఇచ్చి మహిళను అప్పగించారు. మతిస్థిమితం లేని మహిళపై శ్రద్ధ చూపి చికిత్స చేయించి ఆహారం అందజేసి కుటుంబసభ్యులకు అప్పగించడంతో పట్టణ ప్రజలు, దుకాణాదారులు పోలీసులను అభినందించారు.

సంపత్‌కుమార్‌కు టీపీసీసీ పదవి ఇవ్వాలి



అయిజలో నల్ల కండువాలతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

అయిజ: అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌కు టీ పీసీసీ పదవిని ఇచ్చే విషయంలో జాప్యం చేస్తున్నారని, వెంటనే టీ పీసీసీ పదవిని ఇవ్వాలని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు నల్ల కండువాలు ధరించి కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. సంపత్‌కుమార్ విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్ పార్టీ సైనికుడిగా పనిచేస్తూ ఏఐసీసీ సెక్రటరీగా పేరు తెచ్చుకున్నారన్నారు. 30 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీని వీడకుండా పార్టీకి సేవలు చేసినట్లు తెలిపారు. సంపత్ కుమార్‌కు టీపీసీసీ పదవిని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శీను, వివిధ గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

అయిజ: రేషన్ డీలర్లు నిబంధనల మేరకు లబ్ధిదారులకు సరుకులు అందించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మంగమ్మ హెచ్చరించారు. శనివారం రాత్రి మున్సిపాలిటీలోని కొన్ని రేషన్ షాప్‌లతో సహా మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల, మండలంలోని ఉత్తనూరులో రేషన్ షాప్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను, స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. వినియోగదారులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చే బియ్యాన్ని బయట అమ్ముకోరాదని, బియ్యంలో ఫొరెక్స్ విటమిన్‌లు ఉంటాయని పేర్కొన్నారు. వాటిని తినడం వల్ల రక్తహీనతను అరికట్టవచ్చని తెలిపారు. డీలర్ల వేయింగ్ మిషన్‌లలో తేడాలుంటే 6 ఏ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.